ఎలాగైతేనేం రైలుదిగింది. ఇల్లు చేరింది. తల్లిచూసి కన్నీరు కార్చింది. ఎంతైనా కన్నకడుపుకు కనికరముండదూ మరి. తండ్రి వచ్చాడు. తనని సరిగానైనా పలుకరించలా. తన చిన్నిబిడ్డనైనా చేతికి తీసుకోకపోయేసరికి ఆమె మనసు చాలా బాధపడింది. అలాటి మూగబాధలు ఏలా ఎవరికి తెలుస్తాయి.

కిక్కురుమనకుండాఉన్న తండ్రిని ఏలా పరామర్శించి తను వచ్చినకార్యం నివేదించడం? ఆమెకి భయమేసింది. ఆరోజు ఎలాగో గడచిపోయింది.

రాత్రంతా అమ్మ చెప్పింది. అప్పు నాల్గువేలుదాకా పెరుగుతూందని, ఉన్నఇల్లు అమ్మినా ఇంకా రెండువేలు మిగులుతుందనీ, ఇక తనెలా తండ్రినడగడం? తాను పుట్టినప్పటినుంచీ ఒకేబాధ. తల్లిదండ్రులను చాలా వేధించాననుకొంది.

పుట్టింట బాధలు, అత్తింట బాధలు ఇక సహించటం ఆమెకు చేతకాదేమో అనిపించింది. అప్పటికి ఒక్కసారిగా ఆమె జీవితంపై రోత జనించింది. తనభర్తకు ఎలా మొఖం చూపించటం? తాను ఎంత లోకువ కాగలిగిందో తెలిసికొనేసరికి ఆమెప్రాణం అవమానంచే, అభిమానంతో కృంగిపోయింది.

ఈ దుష్టశక్తుల్నుంచీ విడిపోతే...తల్లి, తండ్రి, భర్త, అత్త ఇత్యాదులు. అయితే తన సుగుణ...ఎలా జీవిస్తుంది. ఒక్కసారి సుగుణను హృదయానికి హత్తుకొంది. పుట్టించినవాడు పెట్టకపోతాడా అనే ధీమా ఆమెలో ప్రవేశించింది.

తన తల్లిపై ఆమెకు ఓ రకంగా సానుభూతి కల్గింది. ఓవేళ తాను చనిపోతే అమ్మ ఏడుస్తుంది అనుకొంది శాంత. చనిపోవడమంటే ఆమెకి భయమనిపించింది. రేపటివరకు బ్రతికేఉంటే తాను ఎందరిని వేధించాలె. ఎన్ని తిట్లు తినాలే. ఎంత బాధపడాలె ఇత్యాదులు ఒక్కసారిగా ఆమె కల్లోలహృదయాన్ని అణచిపెట్టాయి. తుఫాను వచ్చేముందు సముద్రంలా ఆమె గంభీరత వహించింది.

అంతే. ఆనాడే ఆమె ఈలోకంలోని సుఖదుఃఖాల్ని అనుభవించిన కడపటిరోజు. ఇన్నిదినాలుగా తనని ఎదిరిస్తున్న దుష్టశక్తులకు లొంగిపోయింది. తన ప్రాణమే బలి ఇచ్చింది. ఆమె మూగబాధలు ఆమెతోనే అంతరించిపోయాయి. ఆమెనుగూర్చిన బాధ ఇక ఎవరికీ లేదు. అంతే.

# ముసలాడి * * మూడో పెళ్లి!

రచన: "నేనే!?"

●

అబ్బో! యెంత గడుసువాడు! ముసలివాడా! గడుసువాడా! ఎవరీ ముసలి? వయ్యాకరణులు వ్యాఖ్యానం చేస్తారు—"ముసలి" అనకూడదు, "ముదుసలి" అనాలి అని. ముసలి అనే మూడక్షరాలు వినగానే ముక్కోపయ్యే ముసలాడికి "ముదుసలి" అని నాల్గక్షరాలు వ్యాకరణరీత్యా అంటే మరెట్టుంటుందో వూహించాలి మీరే. ముసలైతే మనకేం? ఏం లాభం? ఇద్దరు పెళ్లికూతుళ్ళను యేట్లో గలిపి మూడోపెళ్లికి ముచ్చట్లాడుతున్నాడు.

బుగ్గలు పాతాళానికి పీక్కెళ్ళాయి. వెంట్రుకలా స్వచ్ఛమైన తామ్రరేకుల్లాగున్నాయి. క్రాప్‌డ్‌హెడ్, ధరించేవి గ్లాస్కో ధోవతులు, సంవత్సరచందాగట్టి "ఆంధ్ర పత్రిక" తెప్పిస్తున్నాడు. దేనికి? నెరిసిన వెంట్రుకలకు ఔషధం, వీర్యవృద్ధినిజేసే మందులు మొదలైనవాటినిగురించిన అడ్వర్టయిజ్‌మెంట్లు చదివి తెప్పించాలని. మాటలసందటి మరుపొచ్చింది—దంతాల సంగతి. ప్రకృతిదంతం ఒకటివుంటే వొట్టు. అన్నీ కృత్రిమ దంతాలే. మరి మూడోపెళ్ళి చేసుకోబొయ్యే ఆ తాతయ్య వయస్సెంతుండాలి? తాతయ్య అనగానే తెలుస్తుందిగా అరవైయ్యో పడిలో పడుంటాడని. ఆయన చెల్లెలి (విశ్వసలెండి) కి 50,40 సంవత్సరాలమధ్య వున్నాదనుకోండి. వయస్సు లోకానికేం చెప్పమన్నాడు? మన తాత—"అమ్మాయీ నీ వయస్సుకూడా యెవరన్నా ఎంతని ప్రశ్నిస్తే 35 అని జవాబీ, మరి నేను 45 అనేస్తా! ఏం?"

"ముసలి" అనిపిస్తాడా, ఎంతమాత్రంకాదు. న్యూస్ పేపర్లలోని అడ్వర్టయిజ్‌మెంట్ల ఫలితంగా కాస్తకాస్త నల్లగామారుచున్న ఆ మిశ్రకేశములు, డాక్టర్ కోరాగారి సహాయాన ఆతెల్లటి ఆర్టిఫిషియల్‌పండ్లు, చేతిలో Hand Stick ఆ తెల్లటి గ్లాస్కో ధోవతలు, నోట్లో Capstan సిగిరెట్టు, కండ్లకు Wilson చలవద్దాలు, చేతికో West-end రిష్టువాచీ, (బంగారు Chainతో సహా) వ్రేళ్లకు ఉంగరాలు, గోళ్ళకు ఎరుపురంగు, మెడలో సన్నని నైస్‌గా ఒక Gold-Chain ధరించి దండయాత్ర మొదలెట్టాడు మూడో కన్యాన్వేషణానికి. పాపం ఏ ఖర్మంజాలనిపిల్ల పడుతుందో ఆ పకీరి వల్లో. చూస్తున్నాంగా, ఇలాంటివాళ్ళను యీయంత్రయుగంలో. అందరికీ తప్పక తెలిపేస్తాడనే మన చిత్రగుప్త కంపాను. చిత్రగుప్తద్వారా కన్యను కలిగిన తలిదండ్రులు మేల్కొందురు గాక!